ప్రజాశక్తి
సోమవారం 14 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయండి

- టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని ఉన్న గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు తక్షణమే పంపిణీ చేయాలని టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ సీజన్ దృష్ట్యా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేస్తే సాగుకు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. వరి విత్తనాల పంపిణీలో మండల వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఎరువులు, యూరియా రైతులకు పంపిణీ చేయలేదని తెలిపారు. దీంతో, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజ్‌మ్, కందులు, ఇతర విత్తనాలు సకాలంలో పంపిణీ చేస్తే రైతులు సకాలంలో సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బోధనేతర పనులతో.. నలిగిపోతున్న ఉపాధ్యాయులు

- ఆ పనుల నుంచి తప్పించాలని గగ్గోలు - స్పందించని ప్రభుత్వం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: విద్యార్థులకు పాఠాలు బోధించడం ఉపాధ్యాయుల ప్రధాన విధి. విద్యార్థులు చదువుతున్నారా? ఇచ్చిన పని పూర్తి చేశారా? వారికి ఏమైనా అనుమానాలు ఉన్నాయా? ఇలాంటి కీలక అంశాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలించాలి. కానీ, బోధనేతర పనులతోనే ప్రభుత్వ ఉపాధ్యాయుల సమయమంతా గడిచిపోతోంది. బోధనేతర పనులు వద్దు మొర్రో! అంటూ దశాబ్దాలుగా మొత్తుకుంటున్నా పెడచెవిన పెడుతున్న పాలకులు, నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాల కోసం ఒత్తిడి తెస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు.
తరగతి గదిలో విద్యార్థుల చదువును గతంలో ఉపాధ్యాయుడు పనితీరుకు కొలమానంగా ఉండేది. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి బోధన ప్రమాణాలు గుర్తించేవారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ మారింది. ఆన్‌లైన్ పనులు, పిల్లల నోట్ పుస్తకాలు ఎంతవరకు దిద్దారు? డైరీ రాసారా? అంటూ విద్యాశాఖ అధికారులు వెంటపడుతున్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచామని చెబుతున్న ప్రభుత్వం, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలు తెలుసుకోలేదు. తమను బోధనకే పరిమితం చేసి ఫలితాలు ఆశిస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రెండు నెలలు (జూన్, జూలై) బోధనేతర పనులకే సమయం సరిపోతుందని చెబుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించకూడదని నిబంధన ఉన్నా దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. విద్యా సంవత్సరంలో ఆన్ లైన్‌లో చేయాల్సిన అనేక రకాల బోధనేతర పనులన్నీ ఉపాధ్యాయులతోనే చేయిస్తున్నారు. దీంతో, ఉపాధ్యాయులు తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. పిల్లలకు పాఠాలు చెబుతున్నారా? అని తనిఖీ చేయడం కంటే బోధ నేతర పనులు, ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేశారా..లేదా? అనే దానికి ఉన్నతాధికారులు, హెచ్‌ఎంలు ప్రాధాన్యమిస్తున్నారు. యాప్‌ల అప్‌లోడ్ పేరుతో ఉపాధ్యాయులను వేధిస్తున్నారు. ఉపాధ్యాయులకు అవసరం లేని పనులు అప్పగించి అదనపు పని భారం మోపడం సరికాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యాప్ ల అప్ లోడ్ పేరుతో వృథా చేస్తే టీచర్లు పాఠాలు ఎప్పుడూ చెప్పాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల తనిఖీలకు వెళ్లిన అధికారులు విద్యార్థులు ఎలా చదువుతున్నారో ఆరా తీయకుండా బోధనేతర పనులపై ప్రశ్నించడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించలేక మరోవైపు పని భారంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా బోధనను నిర్వీర్యం చేస్తున్న యాప్‌లు, బోధనేతర పనులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ఉపాధ్యాయుల పట్ల విద్యాశాఖ ఉన్నతాధికారుల వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బోధనేతర పనులతో ఒత్తిడి



బోధనేతర పనులతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి. బోధనేతర పనులతో పాఠ్యాంశాలు బోధనకు ఇబ్బందిగా ఉంది. బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారు. అనేక యాప్‌ల పేరిట పని భారం పెంచడంతో విద్యా బోధనకు ఆటంకంగా ఉంది. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి. బోధనేతర పనుల భారం మోపి విద్యాబోధన కుంటుపడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

వి.వెంకటరమణ
బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

యాప్‌లకు యంత్రాంగం ఉండాలి

యాప్‌ల నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. ప్రత్యేక యంత్రాంగా ఉంటే ఉపాధ్యాయులు బోధనకు పరిమితం అవుతారు. ఉపాధ్యాయులను పని భారంతో వేధింపులకు గురి చేస్తూ అవమానించడం తగదు. పాఠశాలలకు రాని విద్యార్థులను పాఠశాలల్లోకి వచ్చేలా ఉపాధ్యాయులను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర పడుతున్నారు. ఇతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన దూరమవుతోంది. ఉపాధ్యాయులను పాఠాల బోధనకే పరిమితం చేయాలి.అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

పాడి వెంకటరావు
టిడబ్ల్యూటియు జిల్లా కమిటీ

బోధనకే పరిమితం చేయాలి



ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించ డంతో విలువైన సమయం వృథా అవుతోంది. ప్రతి దానికి ఒక యాప్ పెట్టి అన్ని అప్‌లోడ్ చేసే పనులు ఉపాధ్యాయులకు అప్పగిస్తూ బోధనకు దూరం చేస్తున్నారు. ఈ విద్య ఏడాదిలో ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు తగ్గడానికి కారణం ప్రభుత్వ విధానాలే కారణం. ఉపాధ్యాయులపై అనవసరమైన ఒత్తిళ్లకు గురిచేయడంతో మెరుగైన ఫలితాలు రావని అధికారులు గుర్తించాలి. బోధనేతర పనులు అప్పజెప్పడంతో ఆ భారం బోధనపై పడి విద్యార్థులకు నష్టం జరుగుతోంది.

సిహెచ్.నాగేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

బోధనేతర పనులు తగ్గించాలి



ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలి. ఏదో ఒక శిక్షణ, యాప్‌ల నిర్వహణ పనులతో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాల్లో ఉండాల్సి వస్తోంది. ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేయడం, కించపరచడం తగదు. యాప్‌ల అప్‌లోడ్ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగ్గించాలి. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

శెట్టి శాంతి
ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు



కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళుతున్న విద్యార్థులు

కాలకృత్యాలకు రోడ్డెక్కిన విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి: హాస్టల్ వసతి గృహాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సరైన నీటి, మరుగుదొడ్ల, వసతి సౌకర్యాలు అందుబాటులేక అవస్థలు పడుతున్నారు. సమీపంలో ఉన్న గెడ్డల్లో కాలా కృత్యాలు, బహిరంగ ప్రదేశంలో స్నానాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల 2లో నిత్యం సమస్యతో విద్యారుథలు సతమతం అవుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినిలకు పైగా విద్యని అభ్యసి స్తున్నారు. విద్యార్థులకు సరిపడడా మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎస్‌డబ్ల్యుఓ అధికారిణి సమస్యను పరిష్కరించ లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇక నైనా వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు

-వ్యాధులపై అవగాహనకు పశువిజ్ఞాన బడులు
-నిరంతరం ముమ్మరంగా వ్యాక్సినేషన్
-ప్రజాశక్తితో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటస్వామి



ప్రజాశక్తి పాడేరు: **అల్లూరి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం డివిజన్లో ఉన్న 22 మండలాల్లో గిరిజన రైతులు తమ వ్యవసాయ అవసరాల కోసం పెంపకం చేస్తున్న పశు సంపద సంరక్షణ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ గొల్ల వెంకటస్వామి వెల్లడించారు. అల్లూరి జిల్లా పరిధిలో ఉన్న పశు సంపద, కోళ్లు తదితర వాటి వివరాలను వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే....**

వ్యాక్సినేషన్‌కు చర్యలు?
జిల్లాలో ముఖ్యంగా వానాకాలంలో పశువులకు సోకే పలు రకాల వ్యాధులకు సంబంధించి వాక్సినేషన్ చేస్తున్నాం. బ్రూసెల్లోసిస్, గొంతు వాపు, జబ్బ వాపు, గాలికుంటు వ్యాధులకు సంబంధించి వ్యాక్సినేషన్ ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. లంపి అనే స్కిన్ డిసీస్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించి వాక్సినేషన్ నిర్వహిస్తున్నాం.

సంచార వైద్యశాలలతో అందిస్తున్న సేవలు
ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం పంపిణీ చేసిన ప్రత్యేక పశువుల అంబులెన్స్‌లతో గ్రామస్థాయిలో సంచార పశు వైద్య సేవలు విస్తరించాయి. అల్లూరి జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున అంబులెన్స్ లను ప్రభుత్వం కేటాయించింది. ఈ అంబులెన్స్‌లలో పశు వైద్యాధికారితో పాటు సిబ్బంది గ్రామస్థాయికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో పశువులను ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నాం. పశు అంబులెన్సుల పంపిణీతో పశు వైద్య సేవలు మరింత మెరుగు అయ్యాయి. రైతులు 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే స్పందించి పశు అంబులెన్స్ ద్వారా వైద్య చికిత్సలు సత్వరమే అందిస్తున్నాం.


పశువిజ్ఞానబడులు నిర్వహణ?
జిల్లాలోని ప్రతి రైతు భరోసా కేంద్రాల పరిధిలో పశు విజ్ఞానబడులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు ప్రతి నెల మొదటి బుధవారం, నాల్గవ బుధవారం, నెలకు రెండుసార్లు చేపడుతున్నాం. సీజనల్ గా పశువులకు వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి



సకాలంలో వ్యాక్సినేషన్ చేయించుకునే విధంగా రైతులను చైతన్య పరుస్తున్నాం. సంచార పశు వైద్యశాల ద్వారా ఉచితంగా అందిస్తున్న 80 రకాల మందులు వాటి చికిత్సలను తెలియజేస్తున్నాం.

ఆంత్రాక్స్ అదుపులో ఉందా
గతంలో పాడేరు ఏజెన్సీలో అరకులోయ, ముంచంగిపుట్టు మండలాల్లో విజృంభించిన ఆంత్రాక్స్ వ్యాధి తక్కువ ముఖం పట్టింది. ఇటీవల తమ పరిశీలనలో కూడా పశువులలో ఈ వ్యాధి లక్షణాలు కాన రాలేదు. గతంలో ఆంత్రాక్స్ ప్రబలిన ప్రాంతాల్లో గత రెండు మూడేళ్ల నుంచి పశువులకు ఈ ఆంత్రాక్స్ వ్యాధి సోకిన లక్షణాలు కనిపించలేదు. ప్రస్తుతం ఏజెన్సీలో ఆంత్రాక్స్ అలజడి సద్దుమణిగింది. ఎప్పటికప్పుడు పశు వ్యాధుల పట్ల రైతులను చైతన్య పరుస్తున్నాం. వ్యాక్సినేషన్ సకాలంలో చేయించుకునే విధంగా రైతులను సిద్ధపరుస్తున్నాం.ఇందుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రాజులమ్మ

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలో వైఎన్ పాకలు నుండి మెయిన్ రోడ్డు క్వారీ జంక్షన్ వరకు రూ.60 లక్షల వ్యయంతో 1.6ం కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి చింతపల్లి ఎఎంసి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రహదారి దుస్థితిని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ గొట్టేటి మాధవి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించారని, ఈ మేరకు వారి సిఫార్సులతో మంజూరైన నిధులతో పనులు చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేశారు..ఎమ్మెల్యే, ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ వైస్ సర్పంచ్ భవాని, వార్డు సభ్యులు రాజేశ్వరి, సచివాలయ కన్వీనర్లు నాగేంద్ర, శివ, విఆర్‌పి దేవుడురాజు, వైఎన్ పాకలు గ్రామస్తులు మాదల పోతురాజు, బాలరాజు, రమణ, ఈశ్వర్, ఎఇ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిన్నా, రావణాపల్లి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సోమరాజు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



సుభద్రమ్మ మృతదేహం



తల్లిని కోల్పోయి బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు

ప్రజాశక్తి - మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం పంచాయతీ ఇంతులూరు వాగు గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలివి. ఇంతులూరు గ్రామంలో కిల్లో సోమనాథ్, కిల్లో సుభద్రమ్మ దంపతులు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం. అందరూ ఐదేళ్లలోపువారే. అయితే శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సోమనాథ్ వేరే పని నిమిత్తం పక్క గ్రామానికి వెళ్లగా, అదే సమయంలో సుభద్రమ్మ విషం తాగి అచేతనంగా పడి ఉంది. చుట్టుపక్కల వారు చూసి, సుభద్రమ్మను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే మృత్యువాత పడింది. తల్లి మరణంతో ఐదేళ్లలోపు నలుగురు పిల్లలంతా బిక్కచచ్చిపోయారు. కాగా సుభద్రమ్మ మృతికి కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు సుభద్రమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టానికి చింతూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సమస్యలపై సిఐటియు పోరాటం

పలు యూనియన్ల నుంచి కార్మికులు చేరిక



యూనియన్‌లో చేరిన కాంట్రాక్ట్ కార్మికులతో సిఐటియు నేతలు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి ఎపి జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేసేవరకు సిఐటియు అలుపెరగని పోరాటం చేస్తుందని మోతుగూడెం సిఐటియు రీజనల్ కార్యదర్శి జె.రత్నం, డొంకరాయి సిఐటియు శాఖ అధ్యక్షుడు వైవి. రమణ స్పష్టం చేశారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక ఎపి జెన్‌కో సివిల్ విభాగంలో పనిచేస్తున్న 43మంది, డిస్ట్రిబ్యూషన్, జల విద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న మరో 12మంది కాంట్రాక్టు కార్మికులు స్థానిక ఎపి 1104 యూనియన్, ఐఎన్‌టియుసి విద్యుత్ సంఘం కార్మికయూనియన్లకు గుడ్‌బై చెప్పి, సిఐటియులో చేరారు.
ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ, సిఐటియుతోనే తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతోనే ఆయా యూనియన్ల కార్మికులు సిఐటియులో చేరారన్నారు. వారి నమ్మకానికి తగ్గట్టుగానే సిఐటియు పక్షాన కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.. ఈనెల 9న పవర్ జెఎసితో చేసుకున్న ఒప్పందంతో కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం జరగనున్న నేపథ్యంలో, దాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ ఈ నెల 17న విద్యుత్ సౌధ, సిఎండి కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టిందని, దీనిలో కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో 25వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని, వీరిని అడ్డం పెట్టుకొని విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చుకునేందుకు యత్నిస్తున్నారే తప్ప, కాంట్రాక్ట్ కార్మికుల ప్రయోజనాలకు పోరాడడం లేదన్నారు. 2018 పిఆర్‌సి ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు, ఇతర సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన బెనిఫిట్స్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
యూనియన్ కోశాధికారి బివి. రమణ, యునైటెడ్ స్టేట్ కమిటీ సభ్యుడు చింతా రాంబాబు, సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్‌కె. సుభాన్ మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు సిఐటియు పోరాటం చేస్తుందని, ఇందులో ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘ నాయకులు వరహాలు, లక్ష్మణ్, విష్ణు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిధులు అందజేత

ముఖ్యమంత్రి భరోసాతో సాయం చర్యల్లో కదలిక

ప్రజాశక్తి-కూనవరం : వరద బాధితులను పరామర్శించడానికి కూనవరం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తిరుగు ప్రయాణంలో అనారోగ్యంగా ఉన్న పాప వేముల శివ చంద్రికను చూసి, ఆమె వైద్యానికి భరోసానిచ్చారు. తల్లిదండ్రులు వేముల నాగమణి,సతీష్ పాపను ఎత్తుకొని తమ బాధను స్వయంగా ముఖ్యమంత్రికి విన్నవించుకుందామని రోడ్డుపై ఎదురు చూస్తుండగా, ఆ పాపను చూసి కాన్వాయ్ ఆపిన సిఎం జగన్మోహనరెడ్డి, స్వయంగా తానే పాప వద్దకు వచ్చి సమస్య ఏంటని పాప తల్లిని అడిగారు. రెండేళ్ల వయస్సులో మెట్టపై నుండి కిందపడి కాలర్ బోన్ విరిగిందని, దీంతో పాప తల వంకరగా ఉండడంతోపాటు ఎదుగుదల లేకుండా పోయిందని వివరించారు. దీంతో పాటు నరాల సమస్య ఉందని వైద్యులు నిర్ధారించారని ముఖ్యమంత్రికి విన్నవించారు.
తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని వేడుకున్నారు.. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి పాప వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని, పాపకు పెన్షన్ కూడా మంజూరు చేస్తానని, పాపకు గతంలో వైద్యానికి ఖర్చుపెట్టిన డబ్బులు కూడా తిరిగి ఇస్తానని భరోసానిచ్చారు. తక్షణమే తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆదేశించారు.



బాధిత చిన్నారిని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్(ఫైల్)

దీంతో స్పందించిన అధికారులు పాప అనారోగ్య సమస్యకు సంబంధించి నిమ్స్ హాస్పటల్ రిపోర్ట్స్, తల్లి బ్యాంకు ఖాతా నెంబర్ తీసుకొని వెళ్లారు. తల్లి ఖాతాలో గతంలో ఖర్చుపెట్టిన రూ.లక్ష వేశారు.తమ బిడ్డ ఆరోగ్యానికి భరోసానిచ్చిన ముఖ్యమంత్రికి, అధికారులకు బాధిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


రాజవొమ్మంగిలో గడపగడపకూ...

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతోనే సిఎం జగన్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక కారణాలతో పింఛన్లు, ఇతర సంక్షేమ లబ్ధి అందని వారి వివరాలను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూకాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, వైస్ ఎంపిపి చప్పా చంద్రరాణి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డు దుస్థితిని పట్టించుకోరా?

ప్రజాశక్తి -సీలేరు: అంతర రాష్ట్ర రహదారి దుస్థితి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు పట్టదా?అనిఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు ప్రశ్నించారు. దాదాపు పాతికేళ్లుగా రహదారి మరమ్మతులు లేక పూర్తిగా శిథిలమైందని, బాగుచేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. రహదారి బాగుచేయాలని లోకులగాంధీ నిరాహారదీక్ష చేశారని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వై.జంక్షన్‌లో వంటావార్పు నిరసన, మండల బంద్ విజయవంతంగా నిర్వహించినా స్పందన లేదన్నారు.
చివరకు పాదయాత్రకు స్పందించి కొంతభాగం మాత్రమే బాగుచేశారన్నారు. అటవీశాఖ అభ్యంతరంతో నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణం జరగడం లేదన్న విషయాన్ని ఇప్పటికైనా పాలకులు గుర్తించి, రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి మండల కోకన్వీనర్ కొర్ర నీలకంఠం, ప్రధాన కార్యదర్శి బత్తుల సిద్ధార్థ మార్క్ పాల్గొన్నారు.

300 మందికి ఉచిత వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న వేమగిరి ఆసుపత్రి సిబ్బంది

ప్రజాశక్తి - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి ఆధ్వర్యం ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. డాక్టర్ జి.భాస్కర్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, ఎస్. సంపత్‌కుమార్ పాల్గొని సుమారు 300 మందికి వైద్య సేవలు అందించారు. 69 మందికి రక్తపరీక్షలు, పది మందికి థైరాయిడ్ పరీక్షలు, పది మందికి ఎక్స్‌రేలు, ఎనిమిది మందికి ఫిజియోథెరపీ చేసినట్లు వైద్యశిబిరాన్ని పర్యవేక్షించినిరామకృష్ణా మఠం ఇంఛార్జి స్వామి వేద విద్యానంద మహరాజ్ తెలిపారు.
పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి 59మందికి కంటి పరీక్షలు చేశారు. 16మందికి కంటిఅద్దాలు, ఆరుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కంటి ఆపరేషన్లకు గుర్తించిన రోగులను వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ గాదిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు భోజనం సమకూర్చారు.

నాలుగేళ్లు దాటినా...

నెరవేరని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీలు

-నిర్మించని వంతెన, రోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట:నాలుగేళ్లు అయినా తమకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే ధర్మశ్రీ నెరవేర్చలేకపోయారని రోలుగుంట మండలం గుండుబాడు పంచాయతీ గ్రామాలైన గుర్రాలపాలెం, కశిరెడ్డిపాలెం, బల్జిపాలెం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గుర్రాలపాలెంలో గ్రామానికి ఆనుకొని పెద్దగెడ్డ ఉంది. ఈ గెడ్డ అవతల సుమారు 20 కుటుంబాల వారు జీవిస్తున్నారు. వీరు 18 ఇళ్ళు నిర్మించుకున్నారు. వర్షం వస్తే గ్రామానికి రావాలంటే భయంభయంగా ఉంటుందని వారు వాపోతున్నారు. ఏ అవసరం వచ్చినా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. 2019 ఎన్నికల ముందు చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వచ్చి తాను గెలిచిన వెంటనే ఈ గ్రామానికి పెద్దగెడ్డ వంతెన నిర్మిస్తానని, గెడ్డ కట్టుకు వెళ్లటానికి, పసరమారమ్మ గుడికి వెళ్లటానికి రహదారి కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని, నాలుగేళ్లు దాటినా హామీ నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే గెలుపుకు కృషి చేశామని, ఎంపిటిసి, సర్పంచ్ కూడా ఎక్కువ మెజార్టీతో గెలిపించామన్నారు. ఇప్పటికైనా నాయకులు స్పందించి పెద్దగెడ్డ వంతెన, గెడ్డ కట్టు రహదారికి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమాజానికి విజ్ఞానం.. జెవివి సంకల్పం

ప్రజాశక్తి-మాడుగుల:శాస్త్రీయ దృక్పథం ప్రపంచ వ్యాప్తం కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాహిత్య విభాగం కన్వీనర్ జే.యలమంద అన్నారు. మాడుగుల విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద ఆదివారం జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైన్స్‌లో వున్న యదార్థం గమనించాలన్నారు. సమాజానికి విజ్ఞానాన్ని అందించడం కోసం జెవివి ఏర్పడిందని తెలిపారు.
జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, జెవివి నాస్తిక సంఘం కాదని, కేవలం సైన్స్, పర్యావరణం వంటి విషయాల కోసం పని చేస్తుందని తెలిపారు.విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి, విజ్ఞానం కలిగించడం కోసం పని చేస్తుందని అన్నారు. ఎంపిపి పెదబాబు మాట్లాడుతూ, భవిష్యత్‌లో జన విజ్ఞాన వేదికకు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు మాట్లాడుతూ, సమాజంలో అనాదిగా సతీసహగమనం, కన్యాశుల్కం, వరకట్నం వంటి దురాచారాలు ఉన్నాయని, వీటిపై జెవివి పలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. వైస్ సర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, జెవివి చేపడుతుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జేవివి జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి అప్పారావు, కార్యదర్శి రామ్ కుమార్, స్థానిక న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రామ్ కుమార్, మాడుగుల డివిజన్ కమిటీ అధ్యక్షులు సురేష్ శాంతో, ప్రధాన కార్యదర్శి తాలపు రెడ్డి నాగచంద్ర, కార్యదర్శి గౌరీపట్టపు మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు జాగాని ఈశ్వరరావు, కోశాధికారి గొట్టాపు చిన్నం నాయుడు పాల్గొన్నారు

గడువులోపు ఓటర్ వెరిఫికేషన్ పూర్తి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేస్తామని తహశీల్దార్ అన్నాజీరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సీపట్నం మండలంలో ఓటర్ వెరిఫికేషన్‌ను అధికారులు, బిఎల్‌ఓలు కలిపి 88 మంది శరవేగంగా చేస్తున్నారని నర్సీపట్నం ఎమ్మార్వో అన్నాజీరావు తెలియజేశారు. నర్సీపట్నం మండలంలో 71 వేలు పైబడి ఓటర్లు ఉన్నారని ఇంతవరకు 50 శాతం వెరిఫికేషన్ పూర్తి చేశామని తెలిపారు. గడువులోపు మిగిలిన 50 శాతం పూర్తి చేస్తామన్నారు. పారదర్శకంగా ఓటర్ లిస్ట్ తయారు చేస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: 15వ వార్డులో కౌన్సిలర్ మాగిరెడ్డి బుల్లిదొర ఆదివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుల్లిదొర మాట్లాడుతూ, ప్రజల విన్నపం మేరకు ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ వార్డ్ అభివృద్ధికి రూ.20లక్షల నిధులు మంజూరు చేశారన్నారు.వార్డు ప్రజల తరుపున ఎంఎల్ఏ గణేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్ ఛార్జ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-గొలుగొండ:అకాల వర్షంతో వాతా వరణం చల్లబడింది. మండలంలోని కృష్ణదేవిపేట, లింగంపేట, చోద్యం, అమ్మపేట, గొలుగొండ తదితర గ్రామాల్లో ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో గత పది రోజులుగా ఎండతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. వరి నాట్లకు ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో పాల్గొన్న బుద్ధా వెంకన్న, పల్లా శ్రీనివాసరావు

బాబు పర్యటన విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 15న విశాఖ బీచ్ రోడ్డులో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయడానికి టిడిపి అనుబంధ సంఘాల నాయకులు కృషి చేయాలని టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి బుద్ధా వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంటు అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెల్లి కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని సీనియర్ ఐఆర్ఎస్ అధికారి వడ్డాది అప్పలరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అంబేద్కర్ సేవా సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా రెల్లి కులస్థుల నుదుటి రాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెల్లి హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ దలాయ్ ఆడమ్స్, రెల్లి కుల ప్రతినిధులు చెన్నా అప్పలరాజు, రౌతు అప్పారావు, వి.గురుమూర్తి, రాష్ట్ర రెల్లి మేధావుల సంఘం అధ్యక్షులు బండి సురేంద్ర, కస్తూరి వెంకటరావు, యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ రాధిక, తదితరులు

సంతానలేమి సమస్యలకు చెక్ పెట్టండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సంతానం లేని జంటలకు అసాధారణమైన చికిత్స, అత్యుత్తమైన సంరక్షణ అందించడంలో ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్ ముందంజలో ఉందని హెడ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ రాధిక పొట్లూరి తెలిపారు. సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఓ హోటల్లో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైజాగ్ యూనిట్ సహకారంతో గర్భం దాల్చిన జంటలకు సత్కరించి కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే ప్రముఖ సంతానోత్పత్తి కేంద్రాలలో ఒకటిగా ఉన్న తమ సంస్థ అధిక విజయాలు సాధిస్తోందని తెలిపారు. సంతాన లేమి సమస్యలతో ఉన్నవారిలో ఆనందాన్ని నింపడమే తమ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

1/70 చట్టానికి తూట్లు

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
పట్టించుకోని పంచాయతీ, రెవెన్యు అధికారులు



చేపడుతున్న నిర్మాణం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండల కేంద్రంలో రోజురోజుకు అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా గిరిజనేతరులు చేపడుతున్నా పంచాయతీ అధికారులు, రెవిన్యూ అధికారులు పట్టించుకో లేదు. గిరిజనేతరుడైన చికెన్ సెంటర్ యాజమాని చెల్లయ్య కుమారుడు మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రహీమ్ తుల్లా షేక్ నాలుగు రోడ్ల కూడలి ఎదురుగా పంచాయతీ, రెవెన్యూ అనుమతులు లేకుండా దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.కో ఆప్షన్ మెంబర్ అధికారంతో పాటు స్థానిక ఎమ్మెల్యే అండ దండలు ఉన్నాయని బహిర్గతంగా చర్చిస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా నిర్మాణాలు చేపడుతుడటం గమనార్హం. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం, పీసా చట్టం అమలులో ఉన్నప్పటికీ ఈ చట్టాలను అతిక్రమించి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారనే విమర్శనాలు బలంగా వినిపిస్తున్నాయి.గిరిజన హక్కులు, చట్టాలు అమలు చేయావలసిన ప్రభుత్వ అధికారులే గిరిజనేతరులకు కొమ్ముకాస్తే చట్టాని రక్షించేది ఎవ్వరని గిరిజన ప్రజాసంఘాలు, ప్రజా సంఘాలు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు విమర్శిస్తున్నారు. గిరిజనులు రోజువారి జీవనాధారం కోసం చిన్నపాటి రేకులు, షెడ్డులు నిర్మించి వ్యాపారాలు చేసుకుంటున్నా వారిపై మాత్రం అధికారులు ఆగమేఘాలపై వచ్చి ఆ షెడ్డులను తొలగిస్తున్నారని అదే గిరిజనేతరులు బహుళ అంతస్తులు, శాశ్వత నివాస గృహలు, లాడ్జిలు(వసతి గృహాలు) నిర్మాణం చేస్తుంటే మాత్రం అధికారులు చూసి చూడనట్టు వ్యహరిస్తున్నారు.అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో చోరీలు

రాత్రి సమయంలో డీజిల్ చౌర్యం
కేసులు నమోదు చేయని పోలీసులు

ప్రజాశక్తి-మాడుగుల: కొద్ది కాలంగా పలు గ్రామాలలో దొంగలు రెచ్చి పోతున్నారు. వందలు, వేలు కాదు. లక్షలాది రూపాయల చోరికి పాల్పడుతున్నారు. ట్రాక్టర్లు, జేసిబిలు, 70,80 మిషన్ల వద్ద నుండి రాత్రి సమయాలలో డీజిల్ చౌర్యానికి పాల్పడుతున్నారు. వివిధ రహదారులు, ఇతర పనుల నిమిత్తం ఉదయం నుండి సాయంత్రం వరకు పనులు చేసి రాత్రి సమయంలో డ్రైవర్లు, యజమానులు ఇళ్లకు చేరుతున్నారు. అర్ధరాత్రి సమయంలో సదరు దొంగలు యంత్రాల వద్దకు చేరి డీజిల్ పైపులను కోసి, డీజిల్ ఎత్తుకు పోతున్నారు. కొంత కాలంగా జరుగుతున్న ఈ దోపిడీలో కొన్ని లక్షలు విలువైన ఇందనం చోరీ జరిగింది. దీనిపై సదరు యంత్రాల యజమానులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు లేవు.

కింతలి నుండి ఘాట్ రోడ్ జంక్షన్ వరకు రహదారి నిర్మాణం జరుగుతుండగా, ఒక పెద్ద రాజకీయ నేత, అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడి యంత్రాలను సైతం ఈ దొంగలు వదలి పెట్టలేదు. ఈ చోరీలకు పాల్పడిన వారిని గుర్తించినప్పటికీ కొందరు నేతలు వీరిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. మొదటి తప్పు కింద వదలి పెట్ట మని, చోరీకి పాల్పడిన యువకుల గ్రామానికి చెందిన నేతలు పోలీసులపై, ఫిర్యాదు దారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దొంగల వద్ద నుండి 10 లక్షలు వసూలు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, నష్ట పోయిన వారికి మాత్రం ఒక్క రూపాయి కూడా ఇస్తామని చెప్పక పోవడం విశేషం.ఈ నేపథ్యంలో బడా నేత వైఖరి ఇప్పటివరకు స్పష్టంగా తెలియడం లేదు.పోలీసులు కూడా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలు రేకెస్తున్నాయి. బాధితుల్లో కొందరు అధికార పార్టీ వారు సైతం ఉన్నారు. రాత్రి సమయాలలో పైపులు కట్ చేసి కావలసినంత డీజిల్ క్యాన్‌లలో నింపుకుని పట్టుకు పోగా, మిగిలిన ఆయిల్ వృథాగా పోతుందని బాధితులు లబో దిబొ మని గగ్గోలు పెడుతున్నారు.

గిరిజనులపై చిన్నచూపు

ప్రజాశక్తి- కోటవురట్ల:గిరిపుత్రుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు తగదని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ జిల్లా నాయకులు గడ్డం బుజ్జి డిమాండ్ చేశారు. అణుకు గిరిజనులు 38 రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు ఆదివారం ఆయన శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 38 రోజులుగా దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు కంటితుడుపు చర్యగా హామీలు ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, జనసేన నాయకులు రాంబాబు, ఏసుబాబు, బండి రాజు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

రైతుకు సాగునీటి కష్టం

- వర్షాధారంపై వ్యవసాయం
- ఏటా తప్పని వర్షాభావం
- ముందుకు కదలని
పోలవరం ఎడమ కాలువ, సుజల స్రవంతి పనులు
- శ్రద్ధ చూపని ప్రభుత్వాలు



తాండవ జలాశయం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో సాగునీటి వనరుల పనులు ఎక్కడివక్కడే వున్నాయి. రైతుకు సాగునీటి వసతి కల్పించాలన్న శ్రద్ధ ప్రభుత్వాలకు లోపించడంతో అత్యధిక భాగం వర్షాధారంపై సాగుచేయాల్సిన పరిస్థితి రైతుకు ఏర్పడింది. వర్షాలు సకాలంలో కురవక ఈ ఏడాది ఖరీఫ్ వలే ప్రతియేటా సకాలంలో పంటవేయలేక అవస్థలు పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసే చిత్తశుద్ధిలేమితో ప్రతిపాదిత ప్రాజెక్టుల పనులు ఏళ్ల తరబడి ముందుకు కదలడంలేదు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తయితే జిల్లాలో వ్యవసాయానికి సాగునీటి కొరత తీరేది. వర్షాలపై సాగుచేయాల్సిన పరిస్థితి వుండేదికాదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యను పరిష్కరించి, ప్రాజెక్టు, ఎడమ కాలువ పనులు పూర్తిచేస్తే అనకాపల్లి జిల్లాలో 10 మండలాల్లోని 1.62 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కలగనుంది. ఎడమ కాలువతో ముడిపడివున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను కూడా పూర్తిచేయగలిగితే 14 మండలాల్లోని మరో 2.73 లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుంది. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తయితే కొత్తగా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీటి సౌకర్యం కలిగేది. ఎంతో ప్రయోజనకరమైన ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిచేయక పోవడంతో జిల్లా రైతాంగం కరువు కాటకాలను ఎదుర్కోవాల్సివస్తోంది. జిల్లాలో ప్రస్తుతం భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ కింద 32,689 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులు రైవాడ, కోణాం, పెద్దేరు జలాశయాల కింద 42,725 ఎకరాల ఆయకట్టు వుంది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల కింద 75,414 ఎకరాలు సాగవుతోంది. ఎడమ కాలువ, సుజల స్రవంతి పూర్తయితే ప్రస్తుత ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరణ జరగనుంది. కానీ ప్రభుత్వాలు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు సరిపడా కేటాయించి, పూర్తిచేయకపోవడంతో రైతులు సాగుకు అవస్థలు పడుతున్నారు.

పోలవరం ఎడమ కాలువ పూర్తయితే..

నక్కపల్లి మండలంలో 31,075, ఎస్.రాయవరంలో 25,890, యలమంచిలిలో 15,261, కశింకోటలో 10,973, అనకాపల్లిలో 3,747, మునగపాకలో 8639, పాయకరావుపేటలో 19,610, రాంబిల్లిలో 20,441, పరవాడలో 2,719, అచ్యుతాపురంలో 23,884 ఎకరాలకు సాగునీరు లభించనుంది.

సుజల స్రవంతి పూర్తయితే..

చోడవరం మండలంలో 17,790, బుచ్చెయ్యపేటలో 28,010, రావికమతంలో 21,992, మాడుగులలో 28,998, చీడికాడలో 13,632, మాకవరపాలెంలో 21,617, కోటవురట్లలో 8,280, రోలుగుంటలో 32,188, నర్సీపట్నంలో 40,100, కశింకోటలో 6,998, అనకాపల్లిలో 7,050, సబ్బవరంలో 12,769, దేవరాపల్లిలో 14,251, కోటపాడులో 19,661 ఎకరాలకు సాగునీటి వసతి కలగనుంది.

పారిశ్రామికవాడలో..

ఉత్సాహంగా వారాహి విజయయాత్ర



వారాహి వాహనం నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న పవన్

ప్రజాశక్తి - గాజువాక, మల్కాపురం : పారిశ్రామిక వాడలో జనసేన వారాహి విజయయాత్ర ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. పవన్ ప్రసంగాన్ని వినేందుకు పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు, పవన్ అభిమానులు తరలివచ్చారు. వారాహి విజయ యాత్ర వాహనం కాన్వెంట్ జంక్షన్, సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం మీదుగా గాజువాకకు చేరుకుంది. అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడాల్సిన అవసరముందని పవన్ అన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న ఆటో : వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సి సమీపంలో ఆదివారం బైక్‌ను ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొయ్యూరు మండలం పాడి గ్రామానికి చెందిన నడిగట్ల రమణ(28) బైక్‌పై వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ గాయపడ్డాడు. రమణ గొలుగొండ పిహెచ్‌సి ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. ఈ ఘటనపై కృష్ణదేవిపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి-చోడవరం : గాంధీగ్రామం పంచాయితీ మారుతీనగర్‌లో గార్నాల దేవి ఇంట్లో శనివారం రాత్రి దొంగల పడి మూడు తులాల బంగారం, రూ.1.10లక్షల నగదు అపహరించారు. దేవి స్థానిక హాస్టల్‌లో నైట్‌వాచ్ ఉమెన్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు ఇంట్లో ఉంటూ, రాత్రి మేడ పైకి వెళ్లి నిద్రపోయాడు. ఇదిగమనించిన దొంగలు ఇంటి లోపల బీరువా పగలగొట్టి, బంగారం, నగదును అపహరించుకుపోయారు. అందిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుని అదృశ్యం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలో ధర్మసాగరం గ్రామానికి చెందిన చుక్కల అప్పలరాజు కుమారుడు జశ్వంత్ ఈనెల 12న అదృశ్యమైనట్లు రూరల్ పోలీస్ స్టేషన్లో కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. బాధిత అప్పలరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. పాత బస్టాండ్‌లో తన బట్టల షాపు వద్దకు 12న జస్వంత్ వచ్చాడని, సరిగ్గా చదవ లేదని మందలించడంతో రాత్రి 8 సమయంలో బయటికి వెళ్ళాడు.తాను పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాను. జస్వంత్ ఇంటికి రాక పోవడంతో కుటుంబీకులు గాలించిన ఆచూకీ లభ్యం కాకోపవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు తన కుమారుడు ఆచూకీ తెలిస్తే ఫోన్: 8985373069కు తెలియజేయగలరని విజ్ఞప్తి చేశారు.

రిజర్వాయర్ నీరు విడుదల

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ మండలం రావణాపల్లి రిజర్వాయర్ నీటిని ఆదివారం గేట్లు ఎత్తి విడుదల చేశారు. రైతులు నీటిని సద్వినియోగం చేసుకొని, పొదుపుగా వాడుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, కొమిర సర్పంచ్ అల్లు రాజుబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొల్లు అప్పలనాయుడు, ఏటిగైరంపేట మాజీ ఎంపిటిసి పాము రాజుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు సుర్ల రమణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ కొల్లు రాము, సచివాలయ కన్వీనర్ మడగల పైడియ్య, బూత్ కన్వీనర్ కొల్లు గంగునాయుడు, రిజర్వాయర్ రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిల్డ్రన్స్ క్లబ్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ ఉత్సాహంగా సాగింది. పిల్లలతో కథల పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్, పాటల పాడటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని దమయంతి మాట్లాడుతూ, ఎండలు బాగా ఎక్కువగా ఉన్నందున పిల్లలు . నీరు బాగా తాగాలని, స్కూల్ లో ఇచ్చిన ఇంటి పని ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలని సూచించారు.

బంగారయ్య మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి పంచాయతీ ముద్దాడపేటకు చెందిన సిపిఎం సానుభూతిపరుడు ముద్దాడ బంగారయ్య (85) ఆదివారం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందాడు. బంగారయ్య భౌతిక కాయాన్ని సిపిఎం భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, జోన్ కమిటీ సభ్యులు వి.నాగరాజు, ఎస్.అప్పలనాయుడు, ఎస్.వర్మ, చిల్ల అప్పారావు, ఎస్.గున్న, భాగం లక్ష్మి తదితరులు సందర్శించి ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బంగారయ్య దాకమర్రి ఎంపిటిసి సభ్యునిగా పోటీ చేశారని, సిపిఎం, సిఐటియు అభివృద్ధికి, ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అతని కుమారుల్లో ఒకరు రాము పార్టీలో, సిఐటియులో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.



అవయవదాతల కుటుంబీకులను సత్కరిస్తున్న కలెక్టర్

అవయవదానంపై పెరిగిన అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గతం కంటే అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరిగిందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అవయవదానం చేసిన వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, పదహారేళ్ల బాలునికి జీవన్‌దాన్‌లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఉచితంగా చేయించారని చెప్పారు. ప్రజలకు ఉచిత వైద్యం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అవయవదానంపై రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లుగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా అవయవాల సేకరణ, మార్పిడి చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో అవయవదానం చేసి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించిన ఘనత విమ్స్ ఆసుపత్రికి దక్కిందన్నారు. అవయవ దానం చేసిన కుటుంబ సభ్యులకు విశాఖ నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కన్సల్టెన్సీ సేవలతో పాటు ఆసుపత్రి ఖర్చుల విషయంలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థల అధ్యక్షులు డాక్టర్ శివ నాగేందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వర్‌రావు, విమ్స్ ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు, ఎన్‌జిఒలు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రుషికొండపై రాద్ధాంతం దేనికి ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'పవన్ కల్యాణ్‌కు రుషికొండపై ఎందుకు అంత ప్రేమ. ఎప్పుడు విశాఖపట్నం వచ్చినా రుషికొండకే వెళ్తారు. ఎదురుగా లోకేష్ బంధువుకు చెందిన గీతం యూనివర్సిటీకి వెళ్లవచ్చు కదా ?' అని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రుషికొండపై అనవసర రాద్ధాంతం దేనికన్నారు. విశాఖ అభివృద్ధిని పవన్ అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్షాలు, ప్రతిపక్ష మీడియా వేధించడం వల్లే ఎంపీ ఎంవివి.సత్యనారాయణ విశాఖ నుంచి వెళ్లిపోతానని అన్నట్టు చెప్పారు.

అయ్యప్ప భక్తులకు సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అయ్యప్ప భక్తులకు విశేష సేవలందిస్తామని అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ కార్యవర్గం తెలిపింది. కార్యవర్గం ఎన్నికలు ఆదివారం విశాఖ నగరంలోని శంకర మఠంలో జరిగాయి.. జాతీయ అధ్యక్షులుగా కె.అయ్యప్ప దాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు జాతీయ కార్యవర్గంలో 21 మంది సభ్యులుగా ఉన్నారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి భక్తుల అవసరాలు తీరుస్తామన్నారు.

పవన్ పర్యటనపై ఆంక్షలెందుకు ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పవన్ పర్యటనపై కొద్ది రోజులుగా ప్రభుత్వం ఆంక్షలు విధించి ఆటంకాలు కల్పించడం దారుణమని జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉషోదయ జంక్షన్‌లోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెందుర్తిలో వార్డు వాలంటీర్ చేతిలో హతమైన వరలక్ష్మి కుటుంబాన్ని వైసిపి నాయకులు పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీకి ఎలా మాట్లాడాలో కూడా తెలియదని అన్నారు. ఎంపీ ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన ప్రాజెక్టులన్నీ అనధికార భూముల్లోనే ఉన్నాయన్నారు.